

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



## (గత సంచిక తరువాయి)

15

**శివ** హాస్పిటల్ కి వెళ్ళిపోగానే పవిత్రకి  ఇల్లంతా బోసిపోయినట్టు అనిపించింది. ఇన్నాళ్ళు సరళ ఆమె భర్త ఉన్నారు కాబట్టి సందడిగా ఉండేది. ఇప్పుడు ఒక్కతీ ఉండేసరికి అలా ఒక్కతీ ఉండడం అలవాటు లేని పవిత్రకి గుబులుగా అనిపించింది. ఏం చేయాలో తోచలేదు. అమ్మానాన్న, నానమ్మ గుర్తొచ్చారు. ఫోన్ ఉంటె హాయిగా మాట్లాడుకునేది. ఇక్కడ ఫోన్ లేకపోడం ఏమిటి? అనుకుంది. మళ్ళీ అవును ఇప్పుడేగా కాపురం పెట్టాము. ఇంక తీసుకుంటాడెమో కనెక్షన్ అనుకుని మనసుకి సర్ది చెప్పుకుంది.

నానమ్మని రమ్మని ఉత్తరం రాయాలి. లేదంటే టెలిగ్రాం ఇవ్వాలి. సాయంత్రం శివ రాగానే చెప్పాలి. నానమ్మ ఉంటె తోడుగా ఉంటుంది.

వంట గదిలోకి వెళ్లి టిఫిన్ తిన్న ప్లేట్స్, ఖాళీ అయిన గిన్నెలు అన్నీ సింక్ లో వేసింది. కిచెన్ ప్లాట్ ఫాం శుభ్రం చేసి, స్నానం చేసి పూజ చేసుకుంది. ఇంక చేయడానికి పనేమీ కనిపించలేదు.

వంట చేయడం అలవాటు లేదు. ఫ్రిజ్ తెరిచి చూసింది. బాస్కెట్ లో టమాటా, వంకాయలు, పచ్చిమిర్చి, దోసకాయలు ఉన్నాయి. అమ్మ దగ్గర పొందిగ్గా కూర్చుని ఏనాడూ వంట చేయడం నేర్చుకోలేదు. చూచాయగా ఎలా చేయాలో తెలుసు. కానీ ఉప్పెంత వేయాలి? కారం వేయాలా? పచ్చి మిరపకాయలు వాడాలా? నూనె ఎంత వేయాలి? ఇలాంటివి తెలియవు. పవిత్ర మనసుని  ఆకస్మాత్తుగా ఒక అభద్రతా భావం చుట్టేసింది.

వంట చేయలేదు అంటే శివ ఏమన్నా అంటాడేమో అని భయం వేసింది. కనీసం పిన్నత్త గారన్నా ఈ పది రోజుల నుంచి దగ్గరుండి తనతో వంట చేయించినా బాగుండేది. ఆవిడ వంట గదిలోకి రానివ్వలేదు. గుమ్మం దగ్గరకు వచ్చినా, “ ఏం కావాలి? నీకిప్పటి నుంచే ఈ వంటగది ఎందుకు? నీకేం కావాలన్నా నేనున్నాగా “ అంటూ రానివ్వలేదు.

నిట్టూర్చింది పవిత్ర. పరికిణీ ఓణీల్లో పరుగులు పెట్టిన పవిత్ర అప్పుడే ఒకరికి భార్య, ఇంటి ఇల్లాలు అనే పాత్ర పోషించాల్సి రావడం చిత్రంగా ఉంది.

ఇక్కడికి వచ్చిన దగ్గర నుంచి మ్యూజియం అని, గండిపేట అని, చార్మినార్ అనీ తిప్పాడు. సరళ ఉదయం బ్రేక్ ఫాస్ట్ ఏ ఇడ్లీనో , దోసో చేసి పెడితే తిని, ఇంట్లోంచి బయట పడి, మధ్యాహ్నం హోటల్ లో భోజనం చేసి, మరి కాసేపు తిరిగి, ఇంటికి వచ్చి, సరళ సిద్ధంగా ఉంచిన మంచి భోజనం చేసి, పడుకోడం.

మధ్య, మధ్య సరళ హాస్యోక్తులు, విశ్వ ప్రసాద్ కబుర్లు హాయిగా గడిచాయి పదిరోజులు. సరళే "మేమున్న నాలుగు రోజులు ఎంజాయ్ చేయండి. తరవాత యాంత్రికంగా మారతారు. అతను హాస్పిటల్, నువ్వు ఇల్లు చూసుకోడం, క్షణం తీరుబడి ఉండదు" అంటూ బలవంతంగా ఏదో ఒక ప్లాన్ చేసి బయటకి పంపించింది.

వాళ్లున్నప్పుడు బాగుంది దిగులుగా అనుకుంటూ బెడ్ రూమ్ లోకి వెళ్ళింది.

రోజొక చీర కట్టుకుని, విప్పేసి అలా పడేసిందేమో బట్టల స్టాండ్ మీద, చిందరవందరగా పడి ఉన్న చీరలు తీసి మడతలు పెట్టి, బీరువాలో సర్దుకుంది. తన నగలు కూడా లాకర్ లో అడ్డ దిడ్డంగా పెట్టి ఉన్నాయి. తాళం చెవి లాకర్ కే ఉంది. పవిత్ర నగలన్నీ తీసి సర్దసాగింది. అందులో ఆమెకి అన్ని నగలు కనిపించలేదు. జూకాలు, ఏవో కొన్ని గొలుసులు, నల్లపూసల గొలుసు తప్ప తండ్రి చిన్నప్పటి నుంచీ కొంటూ వచ్చిన చాలా నగలు ఉండాలి. అమ్మ అన్నీ ఇచ్చి పంపించింది. ఏవీ అవన్నీ, జాజిమొగ్గల నెక్లస్, చంద్రహారం, కాసులపేరు, రాళ్ళ నెక్లస్... ఏవి అవన్నీ?

ఆమెకి భయం వేసింది. ఎక్కడ పెట్టానబ్బా అనుకుంటూ బీరువా అంతా వెతికింది. తన నగలు అన్నీ సరళ చేతికి ఇచ్చి జాగ్రత్త చేయమంది. ఆవిడే తనకి ఏరోజు, ఏ చీర మీద ఏ నగ వేసుకోవాలో సెలెక్ట్ చేసి ఇచ్చింది. కానీ చంద్రహారం, కాసులపేరు, నెక్లస్ లు ఇవ్వలేదు. అవన్నీ పెళ్ళిళ్ళు, పేరంటాలు ఉన్నప్పుడు వేసుకోవాలి అంది.

బహుశా ఆవిడే ఎక్కడో జాగ్రత్తగా పెట్టి ఉంటుంది. సాయంత్రం ఈయన వచ్చాక అడగాలి అనుకుని, కొంచెం నిశ్చింతగా అన్నీ ఎక్కడివక్కడ సర్దేసి, మంచం మీద వాలింది.

తన మంచం, అమ్మ నానమ్మ మందలింపులు, ఎంత బాగుండేది ఆ జీవితం?

పవిత్రకి తన స్నేహితురాళ్ళు గుర్తొచ్చారు. వెంటనే మోహన్ గుర్తొచ్చాడు. ఎలా ఉన్నాడో పాపం! తన వల్ల అతనికి ఎంత గాయం అయింది! ఎవరు అతని మీద హత్యాప్రయత్నం చేసింది? ఎందుకు అతనంటే అంత కక్ష? మోహన్ ఆలోచనలు మనసంతా కమ్మేశాయి. ఎందుకో తెలియదు... ఒకసారి మోహన్ ని కలిసి సారీ చెప్పాలి అనిపించింది. ఎక్కడున్నాడో! అనుకుంది.

ఆలోచనల మధ్య కొంచెం సేపట్లోనే నిద్ర పట్టేసింది.

దబదబా తలుపు చప్పుడు అవుతోంటే మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచిన తరవాత కాసేపు తను ఎక్కడ ఉందో అర్థం కాలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఒక్క ఫ్యాన్ చప్పుడు తప్ప ఎక్కడా ఎలాంటి శబ్దం లేదు. అలాంటిది తలుపు ఎవరు కొడుతున్నారు '? అనుమానంతో, కొంచెం భయంతో లేచి హాల్లోకి నడిచి తలుపు దగ్గరకు వెళ్ళింది. కొన్ని క్షణాలు తీయనా, వద్దా అనే సంశయంతో నిలబడి, గబుక్కున గుర్తుకు వచ్చి కిటికీ పరదా తొలగించి తొంగి చూసింది.

నల్లగా ఉన్న నలభై ఏళ్ల స్త్రీ, చీర కుచ్చిళ్ళు నడుములో దోపి నిలబడి ఉంది.

పనిమనిషి పని అయిపోగానే వస్తుంది. అన్న శివ మాటలు గుర్తొచ్చి, ఊపిరి పీల్చుకుంది.

తలుపు తెరిచి పక్కకి తప్పుకుంది.

"పడుకున్నారా అమ్మాయిగారూ!" చనువుగా నవ్వుతూ లోపలికి వచ్చి, అలవాటైన దానిలా నేరుగా వంట గదిలోకి వెళ్లి, సింక్ లో గిన్నెలు ఒక ప్లాస్టిక్ టబ్ లో వేసుకుని, యుటిలిటీ లోకి వెళ్ళింది. గిన్నేల్లోకి నీరు తిప్పి, చీపురు తీసుకుని ఇల్లు ఊడుస్తూ కబుర్లు మొదలు పెట్టింది.

"ఊళ్ళో మీ తల్లిగారు వాళ్ళది పెద్దిల్లు అంట కదండీ. ఇంట్లో అమ్మగారూ, అయ్యగారూ, మీ నానమ్మగారూ ఉంటారంట కదా! ఇక్కడ భయమేసిందా ఒక్కరే ఉంటె"

ఆమె చనువులో ఆప్యాయత గమనించిన పవిత్ర "అవును కొంచెం భయం వేసింది. నిన్నటిదాకా చిన్నత్తయ్యగారున్నారు కదా! ఏమి అనిపించలేదు. ఆవిడ వెళ్ళాక దిగులుగా అనిపించింది" అంది

ఫక్కున నవ్వింది ఆమె. "ఆరేడికి పోతారు లెండి. రేపు వచ్చేత్తారు" అంది.

"అవునా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది పవిత్ర.

"ఆవెగారు ఇక్కడే ఉంటారు. అయ్యగారు ఎప్పుడూ ఏదో ఒక క్యాంపుకి ఎల్తారు. ఆవెగారు ఇక్కడికి వచ్చేత్తారు. డాక్టర్ బాబుగారికి ఇబ్బంది అని ఆరు అయిదరాబాద్ వచ్చినపుడల్లా ఇక్కడే ఉంటారు. ఆరికి వండి పెడుతూ మంచీ, చెడూ చూసుకుంటూ ఉంటారు."

"ఓ... శివ అంటే ఆవిడకి అంత ఇష్టం కాబోలు. పెంచిన ప్రేమ" అనుకుంది పవిత్ర.

"ఇన్నాళ్ళూ ఆయన ఒక్కరే ఉండేవారు అని వచ్చి ఉంటారు. ఇక నేనున్నాగా వస్తారో, రారో అంది"

ఒంగి ఊడుస్తున్న ఆమె తలెత్తి పవిత్ర మొహంలోకి చూసి నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు?" అడిగింది పవిత్ర.

ఆమె పవిత్రకి దగ్గరగా వచ్చి స్వరం తగ్గించి చెప్పసాగింది. "మీరు చూస్తుంటే చాలా చిన్నపిల్ల, ఇంకా ఇరవై ఏళ్ళు కూడా వచ్చినట్టు లేవు. అప్పుడే పెళ్లి చేసుకుని వచ్చారు. డాక్టర్ బాబుగారు మీకన్నా పదేళ్లన్నా పెద్దోరు అనుకుంటా. మీకో రహస్యం చెబుతా... ఈ రహస్యం మీ కాపురం చెడగొట్టాలి అని చెప్పడం లేదు. నా బిడ్డలాంటి దానివి అని చెప్తున్నా. ఇప్పుడు మీరు నాతో అన్న మాట రేపు ఆయమ్మ వచ్చాక అనమాకండి."

"ఏం? ఎందుకు?" నుదురు చిట్లించి అడిగింది.

చీపురు కింద పడేసి, “మీరు చూస్తే ఇంత అమాయకంగా ఉన్నారు. ఎట్టా బతుకుతారో ఈ అయ్య దగ్గర. అమ్మాయిగారూ! నేనీ ఇంట్లో రెండేళ్ళ నుంచి పని చేత్తున్నా. డాక్టర్ బాబు గారు, ఆయమ్మ గారూ...” ఆగిపోయింది.

పవిత్ర “చెప్పు “ అంది.

“ఏం చెప్పమంటారు? ఆయమ్మ గారు పేరుకి పిన్ని గానీ, ఆళ్ళ మద్య తల్లి,కొడుకుల బందం కన్నా ఆ బందమే ఎక్కువ. “

“ఏ బంధం?” అయోమయంగా అడిగింది పవిత్ర.

తటపటాయిస్తూ అంది “అదే... అది, అది... మంచం బందం”

పవిత్ర ఉలిక్కిపడి కొంచెం గట్టిగానే అరిచింది. “ఛీ ఏం మాట్లాడుతున్నావు?” అని.

ఆమె బెదరలేదు. స్థిరంగా అంది.” మీకే తెలుత్తుంది. నాలుగు రోజులాగండి. కానీ అమ్మా మీరు కొంచెం గడుసుదనం నేర్చుకోవాల. లేకుంటే కాపురం నిలవదు. నన్ను చమించండి... ఇట్టాంటి రహస్యాలు చెప్పకూడదు. కానీ ఇంటిగుట్టు ఇల్లాలికి తెలియాలి అని చెప్తున్నా. మీకే కట్టం వచ్చినా నేనున్నా... జాగ్రత్త తల్లీ” కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరుగుతుంటే పవిత్ర తల మీద చేయి వేసి ఆప్యాయంగా నిమిరింది.

పవిత్రకి అంతా అయోమయంగా అనిపించింది. ఎంత తప్పు? ఈమె అబద్ధం చెప్తోంది. శివ, శివ... అలాంటివాడా? తల్లి లాంటి పిన్నితో...లేదు, అలా జరగదు. శివకి తానంటే ప్రాణం. తనతో కాక, ఇంకో స్త్రీతో అందులోనూ పిన్నితో... ఛీ, ఛీ.. దుఃఖం వచ్చింది. రుద్ధమైన స్వరంతో అంది. “నువ్వు తప్పు మాట్లాడుతున్నావు. నిన్ను నమ్మను. రేపటి నుంచీ నువ్వు రావద్దు. నేను చేసుకుంటాను పని” అంది కోపం అణచుకుంటూ.

ఆమె కోపం తెచ్చుకోలేదు. “నాకు తెలుసు మీరు నమ్మరని. కానీ మీరు వచ్చింది ఒక చక్కని సంసార జీవితంలోకి కాదు, ఒక నరకంలోకి. ఈ మాట చెప్పడానికి పది రోజుల నుంచి ఎదురుచూస్తున్నా. అసలు మీ ఊరు, మీ పేరు తెలిసి ఉంటే పెళ్ళికి ముందే ఈ పెళ్లి చేసుకోవద్దు అని చెప్పాలనుకున్నా. నన్ను నమ్మండి. నాకు మీ వయసు కూతుళ్ళు ఇద్దరు ఉన్నారు. వాల్లెంతో మీరూ అంతే. నేను పని మానను. నేను లేకుంటే మిమ్మల్ని ఎవరు కాపాడుతారు?” ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగి చెంపల మీదకి జారాయి.

పవిత్ర చకితురాలై నిలబడిపోయింది. ఆమెకి ఒక్కసారిగా పరిసరాలు గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది. నిలబడలేక నిస్సత్తువగా మంచం మీద వాలిపోయి, రెండు చేతుల్లో మొహం దాచుకుని, “నానమ్మా” అంటూ బావురుమంది.

ఏదో చెప్పబోతున్న ఆమె బయట స్కూటర్ ఆగిన శబ్దం విని ఉలిక్కిపడి కింద పడేసిన చీపురు అందుకుంది.

“అమ్మాయిగారూ! ఈ ఇసయాలు మీకు తెలిసినట్టు చెప్పకండి. కళ్ళు తుడుచుకోండి. అయ్యగారు వచ్చారు. లేవండి. మామూలుగా ఉండండి. జరిగేది గమనించండి. నేనున్నా కదా బయపడమాకండి. అయ్యగారికి నా మీద అనుమానం వచ్చిందంటే పని మానిపిస్తారు. కానీ, నేను ఇక్కడి నుంచి పోను. నా మాట నమ్మండి. లేవండి. ఏడవకండి.” గుసగుసగా ఆమె చెప్తోంటే, అడుగులు శబ్దం విని, గబుక్కున మంచం మీద నుంచి లేచి బాత్ రూమ్ లోకి వెళ్ళింది పవిత్ర.

శివ లోపలికి వచ్చాడు. గది ఊడుస్తున్న ఆమెని “ఏంటి ఇంత ఆలస్యంగా వచ్చావా? అమ్మాయిగారు ఏది?” అని అడిగాడు.

పవిత్ర టవల్ తో మొహం తుడుచుకుంటూ వచ్చి, మొహానికి నవ్వు పులుముకుని, “మీరు వచ్చేసారా? కాఫీ ఇవ్వనా” అనడిగింది.

“వంట చేయలేదా? లంచ్ చేసి వెడదామని వచ్చాను.” అన్నాడు.

పవిత్ర తలవంచుకుని అంది “నాకు ఏం చేయాలో తెలియలేదు” అంది.

“అదేంటి? ఇంట్లో కూరలు లేవా? ఫ్రిడ్జ్ లో చూసావా?”

“ఉన్నాయి వంకాయలు, టమాటా ఉన్నాయి”

“అయితే, వంకాయ కూర, టమాటా పప్పు చేసేయక పోయావా? ఇందులో అర్థం కాకపోవడం ఏమిటి? నిద్ర పోయావా?” అడిగాడు.

పనిమనిషి అక్కడ నుంచి మరో గదిలోకి వెళ్ళిపోయింది.

పవిత్రకి ఇప్పుడు అతను కొత్తగా కనిపించసాగాడు. ఇతను తనని ఎంతో గాఢంగా ప్రేమించిన శివేనా? నువ్వు లేకుండా నేను బతకలేను పవిత్రా! అని తన ఒడిలో తల పెట్టుకుని ఎంతో తపనగా అన్న డాక్టర్ శివరామ కృష్ణేనా? తన కోసం మధ్యాహ్నం మూడు అవగానే, క్లినిక్ మూసేసి, హాస్పిటల్ కి కూడా వెళ్ళకుండా, కారు తీసుకుని వచ్చి, తన కాలేజ్ గేటు ముందు, గంటలు, గంటలు వేచి చూసిన శివేనా? ఇతనికి సొంత పిన్నితో… ఛీ…లేదు అబద్ధం. పనిమనిషి మాటలు నమ్మి, తనని మనసారా ప్రేమించిన శివని అనుమానించడమా? తప్పు, చాలా పెద్ద తప్పు. రేపే ఆ పనిమనిషిని మాన్పించేసేయాలి. ఎంత ధైర్యం ఆమెకి తన భర్త మీద తనకి నేరాలు చెప్పడానికి? ఆ విషయం ఈయనకి చెప్తే ఆమెని గొంతు పట్టుకుని బయటకి నెడతాడు. పైగా తనని ఎంతో ప్రేమగా, శ్రద్ధగా చూసుకున్న అత్తగారు సరళ గారి గురించి అలా మాట్లాడుతుందా? తనని చిన్నపిల్లని చేసి, ఏం చెప్పినా నమ్మేస్తుంది అనుకుంది కాబోలు. ఇలాంటివే తన మీద ఆయనకీ చెప్తే! అమ్మో వెంటనే ఆమెని పని నుంచి తీసేయాలి.

“ఏంటి ఆలోచిస్తున్నావు? వంకాయ కూర ఎలా చేయాలా అనా! నేను చూపిస్తా పద”. ఆమె చేయి పట్టుకుని వంటగదివైపు లాక్కుని వెళ్ళాడు.

చకచకా ఫ్రిడ్జ్ లో నుంచి వంకాయలు, టమాటా తీసి, శుభ్రంగా కడిగాడు. స్టవ్ వెలిగించి మూకుడు పెట్టు... ఆ షెల్ఫ్ లో నూనె , ఉప్పు, పోపు సామాను అన్నీ ఉంటాయి బయటకు తీయి." అంటూ ఆమెకి పనులు పురమాయిస్తూ, వంకాయలు కట్ చేయసాగాడు.

అంట్లు తోముతున్న ఆమెతో చెప్పాడు" వెంకటమ్మా !నువ్వు మళ్ళీ సాయంత్రం కూడా వచ్చి, మిగిలిన అంట్లు తోమాలి. అమ్మగారికి పని రాదు. నువ్వే చూసుకోవాలి"

ఆమె పవిత్ర వైపు ఒకసారి చూసి, "అట్టాగే బాబూ" అంది.

ఆమె చూపులో ఇదంతా నిజంగా నీమీద ప్రేమ అనుకుంటున్నావా? పిచ్చిదానా. ఇదంతా నాటకం. ముందు ఉంది ముసళ్ళ పండగ అని చెబుతున్నట్టు అనిపించింది.

ఆ చూపుకి ఒక్క క్షణం వణికింది పవిత్ర.

వాళ్ళ వంట అవుతూ ఉంటె, సాయంత్రం వస్తానమ్మా" అని చెప్పి వెళ్ళిపోయింది వెంకటమ్మ. ఆమె వెళ్ళగానే హాయిగా ఊపిరి పీల్చుకుంది పవిత్ర. ఎందుకో ఆమె ఉనికి పవిత్రకి భరించరానిదిగా అనిపించింది.

అరగంటలో పప్పు, కూర చేసి, బియ్యం కడగమని పవిత్రకి చెప్పి, ఒక గ్లాసు బియ్యానికి ఎన్ని నీళ్ళు పోయాలో చూపించి, కుక్కర్ పెట్టేసి, "హమ్మయ్య" అంటూ వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లి, మొహం కడుక్కుని వచ్చాడు.

పవిత్ర కూడా చెమట పట్టిన మొహం , మెడ, కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చింది. మొహానికి పౌడర్ రాసుకుని ఘుమఘుమ లాడుతూ వచ్చిన ఆమెని చూసి, "ఏంటి? మూడ్ వచ్చిందా" అనడిగాడు.

"ఏం మూడ్?" ఇంకా రొమాంటిక్ మూడ్ అంటే అవగాహన లేని, పవిత్ర చిత్రంగా చూసింది.

"ఈ మూడ్" అంటూ ఆమెని రెండు చేతులతో ఎత్తుకుని బెడ్ రూమ్ లోకి తీసుకొచ్చి మంచం మీద పడుకోబెట్టి, పక్కనే పడుకుని నడుం మీద చేయెసి దగ్గరకు లాక్కున్నాడు.

"ఇప్పుడెంటండి మిట్ట మధ్యాహ్నం. వదలండి" అతని చేతులు తన ఒంటి మీద చేస్తున్న విన్యాసాలకి పరవశించి పోతూ, గోముగా అంది.

"పగలు, రాత్రి తేడాలేంటి శృంగారానికి. అయినా నాకు పగలే ఇష్టం. మోర్ కంఫర్టబుల్" అంటూనే ఆమెకి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా పెదవులతో ఆమె పెదవులు బిగించేసాడు.

కొద్ది సేపటి తరవాత ఊడిపోయిన చీర కుచ్చిళ్ళు సర్దుకుంటూ, జాకెట్టు హుక్స్ పెట్టుకుంటూ, "ఈయన మీదా నాకు పితూరీలు చెప్పింది పనిమనిషి. ఎంత ధైర్యం దానికి?" అనుకుంది తీయటి అనుభవాన్ని నెమరేసుకుంటూ.

"దేహానికి ఆకలి తీరింది. కడుపు ఆకలి వేస్తోంది పద భోంచేద్దాం" అన్నాడు.

ఆమె ఒక్కసారి మెత్తగా అతన్ని కౌగలించుకుని, వదిలేసి డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచింది.

అతను వంటగదిలో నుంచి కంచాలు, పదార్థాలు ఉన్న గిన్నెలు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

కంచంలో అన్నం, వడ్డిస్తూ "ఆడుతు పాడుతూ పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నది" అని హమ్ చేస్తూ ముసి,ముసిగా నవ్వుకుంది.

కుర్చీ జరుపుకుని కూర్చుంటూ కంచం ముందుకు జరుపుకున్నాడు.

తనుకూడా కూర్చుని, ముందు కూరతో ఒక ముద్ద తిన్నది. రుచి చూడగానే ఆశ్చర్యంగా అంది "మీరింత బాగా వంట చేస్తారా? ఎలా నేర్చుకున్నారు?"

"మా పిన్ని నేర్పింది. ఎప్పుడన్నా అవసరం అయితే, నీకు వంట వచ్చి ఉండాలి నేర్చుకో అంటూ నేర్పింది. ofcource నాకా అవసరం ఎప్పుడో తప్ప రాలేదు. ఇవాళ మళ్ళీ చేసాను. రేపటి నుంచీ నువ్వే చేయాలి. అయినా పర్లేదు. రెండు రోజుల్లో ఆవిడ వస్తుంది. నీకు కష్టం ఉండదు."

చివ్వున తలెత్తి చూసింది. "ఇద్దరూ వస్తారా?"

"లేదు ఒక్కతీ వస్తుంది. ఆయన క్యాంపు కి వెళ్ళారు. పది రోజుల దాకా రారు. మనకి తోడుగా ఇక్కడే ఉంటుంది."

కొన్ని క్షణాలు పవిత్ర మాట్లాడలేదు. అన్నం లో సున్నాలు చుడుతూ కూర్చుని, నెమ్మదిగా అంది." మా నానమ్మని రమ్మని ఉత్తరం రాస్తాను నాకు కవర్ కావాలి."

అతను తలెత్తి చూసాడు "ఎందుకు?"

"నాకు వంట నేర్పుతుంది… కొంతకాలం నాకు ఇక్కడ అలవాటు అయిందాకా తోడుగా ఉంటుంది."

"అవసరం లేదు. వంట మా పిన్ని నేర్పుతుంది. అలవాటుదేముంది? అదే అవుతుంది."

అతని గొంతులో వినిపించిన తీక్షణతకి మ్రాన్పడి చూసింది.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS